క్లుప్తంగా

శివాలయానికి కేజీ వెండి సమర్పణ



వెండిని సమర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు : నారాయణపురంలోని విఘ్నేశ్వర కాశీ అన్నపూర్ణ దేవాలయంలో వేంచేసి ఉన్న స్వామి వారికి, గణపతి స్వామికి మకరతోరణం కోసం కాకినాడకు చెందిన మామిడి సత్యనారాయణ, రమాదేవి దంపతులు కేజీ వెండిని అందచేశారు. అమెరికాలో ఉంటున్నవారి కుమారుడు సుబ్రహ్మణ్యం, కోడలు గాయత్రి ఈ వెండిని సమకూర్చారు. సత్యనారాయణ దంపతులు ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి అప్పారావు, బొడ్డేపల్లి ప్రసాదుకు ఈ వెండిని అందజేశారు.

కథా సమీక్షలో సియోను కుమారికే జిల్లా ఫస్ట్



సియోను కుమారి

దెందులూరు : ఏలూరులో జరిగిన హేలాపురి బాలోత్సవంలో కథా విశ్లేషణ విభాగంలో దెందులూరు ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని గోలి సియోనుకుమారి జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. ఉపాధ్యాయులు ఎం.పద్మజా కుమారి, డీ.సుధీర్ ఇచ్చిన శిక్షణతో మూడు చేపల కథను సొంత మాటల్లో అద్భుతంగా చెప్పి జిల్లా ప్రథమ స్థానం సాధించిందని హెచ్ఎం పీవీ రామశర్మ చెప్పారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు, పీఎంసీ చైర్మన్ సునీల్, గ్రంథాలయ అధికారి ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు విద్యార్థిని కుమారిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

దెందులూరు : గాలాయగూడెంలోని శ్రీశ్రీశ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కణకణలాడే నిప్పులపై భక్తులు అమ్మవారి నామస్మరణ చేస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వీర్రాజు సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు మరుగు దొడ్లు, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, బందో బస్తు వంటి ఏర్పాట్లు చేశారు. తిరునాళ్లలో మహిళలు అమ్మవారి చీర, కుంకుమ, గాజు లను కొనుగోలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా నత్తానియేలు



నత్తానియేలు

దెందులూరు : గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.నత్తానియేలు బాధ్యతలు స్వీకరించారు. కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన వ్యాయామ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు.

భక్తిశ్రద్ధలతో కైలాస గౌరీ నోము



ముత్తయిదువులకు చీరలు, జాకెట్లను అందిస్తున్న దృశ్యం

భీమడోలు : మాఘ శుద్ధ పౌర్ణమి పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమడోలు శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు, గ్రామస్తులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన పోకూరి ప్రసాద్, లక్ష్మీ లలితారాణి దంపతులు ఆలయంలో కైలాస గౌరీ నోము చేసుకున్నారు. 300మంది ముత్తయిదువులు నోములో పాల్గొన్నారు. ఆలయ పూజారి కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు.

దేవదాయ శాఖ కార్యాలయం ప్రారంభం



దేవదాయ శాఖ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, డీసీ ఎం.విజయరాజు

భీమడోలు : స్థానిక దేవులపల్లి మృత్యుంజయ సత్రం స్థలంలో దేవదాయ ధర్మధాయ శాఖ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన కార్యాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు ప్రారంభించారు. తొలుత పూర్ణకుంభంతో ఎమ్మెల్యే వాసుబాబుకు, డెప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ పూర్వం ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రం వెళ్లే భక్తులు పాద చారులు సేదతీరేందుకు దేవులపల్లి మృత్యుంజయుడు 30 సెంట్ల స్థలాన్ని అందించి ఇక్కడ సత్రాన్ని నిర్మించారని, అలాగే 18.79 ఎకరాల భూమిని దేవదాయ శాఖకు అప్పగించారని ఆయన దాతృత్వం చిరస్మరణీయమన్నారు. సత్రం శిథిలం కావడంతో దేవస్థానం అధికారులు ఇక్కడ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.20 లక్షలతో త్వరలో రామాలయాన్ని నిర్మిస్తారన్నారు. సత్రానికి దాతలు ఇచ్చిన సొమ్ము రూ 9.41 లక్షలు డిపాజిట్ల రూపంలో ఉన్నాయన్నారు. డీసీ ఎం.విజయరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సత్రాలు 200కు పైగా ఉన్నాయని, వాటిని అభివృద్ధిపరిచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసుబాబు, డీసీ విజయరాజులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్, ప్రత్యేక పీపీ ఆల్తి శ్రీనివాసరావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, కోఆప్షన్ సభ్యుడు ఆజామ్, మాజీ వార్డు సభ్యుడు సుతాపల్లి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలరాజు ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



ఎమ్మెల్యే బాలరాజు సంపూర్ణ ఆరోగ్యం కోసం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రార్థిస్తూ ప్రకాష్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయంలో భూక్యా వేణుగోపాల్, దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టారు. కార్యక్రమంలో అర్జా బాలయ్య, ఎంపీటీసీ కుంజా కిరన్, జి.బాలకృష్ణ, పండు, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం



భీమడోలులో సామూహిక పఠన కార్యక్రమంలో నీతి కథలు వల్లిస్తున్న చిన్నారులు

భీమడోలు : భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి ప్రోత్సాహం అందించారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తకమే చక్కని సోపానమన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు. గుండుగొలను గ్రంథపాలకులు జి.నాగమణి, సభ్యులు మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణం





అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు, విశేషాలంకరణలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి

కామవరపుకోట : కామవరపుకోటలో కొలువైన భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల ఆశీర్వచనాలతో మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. అన్ని శివాలయాల్లో శివరాత్రి సమయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు, అందుకు భిన్నంగా తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే స్వామివారి కల్యాణం వెన్నెలలో నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ కల్యాణ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి ప్రారంభించారు. సుమారు 15 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అన్నదాన కమిటీ చైర్మన్ కడిపి పాపారావు తెలిపారు.

తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి



టికు బ్యాంక్ మహాజన సభలో ప్రసంగిస్తున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ది ఏలూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టికు బ్యాంక్)లో రుణాలు తీసుకున్న ఖాతాదారులు సక్రమంగా ప్రతి నెలా వాయిదా చెల్లించాలని ఆ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక శ్రీగాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయం ప్రాంగణంలో టికు బ్యాంక్ మహాజన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అంబికా ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వాయిదాలు చెల్లించని పక్షంలో వాటిని ఒత్తిడిలో ఉన్న రుణాలుగా భావిస్తారని, ఆయా రుణ ఖాతాల నుంచి రావలసిన అసలు, లేక వడ్డీ 90 రోజులు దాటి వసూలు కాకుండా ఉంటే అలాంటి రుణాన్ని నిరర్థక ఆస్తిగా ప్రకటించాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించిందని తెలిపారు. తమ బ్యాంక్ వ్యాపారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలను ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా మార్చడానికి మహాజన సభ ఆమోదించింది. అలాగే 2022 మార్చి 1వ తేదీ నుంచి 2023 జనవరి 31వ తేదీ వరకు నూతనంగా చేర్చుకోబడిన సభ్యత్వాల, వాపసు చేసిన వాటాధనాలను సైతం మహాజన సభ ఆమోదించింది. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.అచ్యుత రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

భీమడోలు : ఆధ్యాత్మిక చింతనతోనే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని గుండుగొలను ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. గుండుగొలనులోని దోకల వీధి సగర్ల సంఘానికి చెందిన కనకదుర్గాదేవి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. పూజారి లంకా శివకుమార్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవధాన్యాలు వేసి పూజాది కార్యక్రమాలు చేసారు. ఈ సందర్భంగా ప్రజలంతా దైవ చింతనతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల శంకర్; జి.మల్లేశ్వరరావు, నాయకులు నల్ల శ్రీనివాసరావు, సగర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగబాబు

పెదపాడు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై బి.నాగబాబు అన్నారు. మండలంలోని కలపర్రు టోల్‌గేట్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనచట్టం ప్రకారం నిబంధనలు పాటించని వారికి అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. దీనివల్ల ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందన్నారు. హెల్మెట్ ధరించనివారికి అపరాధ రుసుము విధించారు.

అపరిశుభ్రంగా వాటర్ ట్యాంక్

పెదవేగి : మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో అంజలిపురం గ్రామంలో జీఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ అపరిశుభ్రంగా మారింది. ట్యాంక్ చుట్టూ నాచు పేరుకుపోయింది. ట్యాంక్ లోపల కూడా అపరిశుభ్రంగా ఉండడంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోడిపందేలపై దాడి

ఉంగుటూరు : మండలంలోని రామచంద్రపురం గ్రామ తోటల్లో కోడిపందేలపై చేబ్రోలు పోలీసులు దాడిచేశారు. శనివారం అర్ధరాత్రి 1 గంట సమయంలో పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. 20 కోళ్లు, 25 కత్తులు, రూ.87,700 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైభవంగా దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ట



దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు, దాత కంతేటి

గణపవరం : మండలంలోని అర్ధవరం గ్రామంలో శ్రీ దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కంతేటి భుజంగరాజు, సూరమ్మ దంపతుల కుమారుడు కంతేటి సూర్యనారాయణరాజు సుమారు రూ.40 లక్షల విరాళంతో ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట, పూజలు, హోమాలు, అన్నసమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. దాత కంతేటి సూర్యనారాయణరాజు, నాగలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరానికి చెందిన 9 ఏళ్ల చిన్నారి బొలిశెట్టి చేతన భగవద్గీత పారాయణం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎంతో అనుభవం ఉన్నట్లుగా వినసొంపుగా ఆ చిన్నారి చేసిన ప్రసంగం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా చేతనను పలువురు అభినందించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. సుమారు మూడువేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎంపీపీ అర్ధవరం రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన జాతర మహోత్సవాలు

బుట్టాయగూడెం : కామవరం సమీపంలో కొలువై ఉన్న గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ఈ వేడుకలను గిరిజనులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా పూర్తిగా గిరిజన సాంప్రదాయంలో ఈ వేడుకలను ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి పసుపు, కుంకుమ పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. అనంతరం వర్సా వారి ఇంటి ఇలవేల్పెన గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, దుర్గమ్మ తల్లులకు రాజుపటన్నం పోసి తీన్మార్ డప్పులతో సంబరాలు చేసి గద్దెల మీదకు తీసుకువెళ్లారు. అనంతరం అడవిలోకి తీసుకువెళ్లి రాజు గద్దెలకు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర మహోత్సవాలు ఈనెల 9వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీరామకోటి మహోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో శ్రీ సీతారాములు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో 91వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వివిధ ధ్వజాల ఆరోహణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించి కలశ స్థాపన, అఖండ దీపారాధన, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామివారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వీరాప్రసాద్ శిష్య బృందం నిర్వహించిన సంగీత కచేరి వీనులవిందు చేసింది. అనంతరం మద్దూరి సత్యనారాయణ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీవిశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మాజీ మంత్రి వసంతకుమార్ మృతికి సంతాపం

ద్వారకాతిరుమల : క్షేత్రంలో కాపు కల్యాణ మండప నిర్మాణానికి ఎనలేని కృషి చేసిన రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ లేని లోటు తీరనిదని ఉంగుటూరు ఎమ్మెల్యే, కాపు కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వారు వసంతకుమార్ మృతికి సంతాపాన్ని తెలిపారు. అనంతరం ట్రస్టు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండప ట్రస్టు గౌరవాధ్యక్షుడు చిన్నమిల్లి వెంకట్రాయుడు, ట్రెజరర్ మాకా శ్రీనివాస్, కార్యదర్శి పాశం రామాంజనేయులు, కల్యాణ మండప స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్: ఏలూరు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా పాటూరి సురేష్‌బాబు ఎన్నికయ్యారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఏలూరులోని యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక వివరాలను ఆయన వెల్లడించారు. గౌరవ అధ్యక్షులుగా ఓవీ ధనుంజయరావు, సహాధ్యక్షులుగా కె.శ్రీధర్, జి.మాధవిలత, ప్రధాన కార్యదర్శిగా పంపన శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా తాడేపల్లి యేషయ్య, కార్యదర్శులు పీవీ జనార్ధనరావు, పీవీ సుబ్బారావు, బి.ప్రభాకర్‌రావు, కేపీఎస్ మణి, పి.సత్యనారాయణ, దుర్గాభవాని ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు ఆడిట్ కన్వీనర్‌గా బి.రవిశోభన్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా వి కనకదుర్గ, ఏపీఎస్ రాజు, ఎల్.కనకదుర్గ, ఎస్‌కే సుభాని బేగం ఎన్నికయ్యారని వెల్లడించారు. ఎన్నికల అధికారిగా నంబూరి రాంబాబు, పరిశీలకుడుగా పీవీ నరసింహరావు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలని నూతన కార్యవర్గానికి సూచించారని వివరించారు.

బైక్ ర్యాలీగా తరలివెళ్లిన యాదవ యువత



ద్వారకాతిరుమలకు బైక్ ర్యాలీగా తరలివెళుతున్న యువకులు

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలో ఆదివారం నిర్వహించిన యాదవ యువ సమ్మేళనం కార్యక్రమానికి యాదవ యువకులు మోటారు బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఏలూరు జిల్లా యాదవ యువ సమితి అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ (బాలు) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరులో బైక్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ జిల్లాలో యాదవులు రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఉన్నారన్నారు. అయినా యాదవులకు రాజకీయంగా తగిన గుర్తింపు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో యాదవులకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. యాదవ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.2వేల కోట్లు కేటాయించాలని, యువతకు ఉపాధి కొరకు రూ.10 లక్షల రుణాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారికి కార్లను 50 శాతం సబ్సిడీతో కేటాయించాలన్నారు. పేద యాదవ విద్యార్థులకు గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించాలని, మెరిట్ సాధించిన ఆసక్తి కలిగిన విద్యార్థులు 50 మందిని ఏటా విదేశాలకు పంపించాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యాదవ సమితి అధ్యక్షుడు నీలపాల దినేష్, పొన్నుబోయిన సురేష్, కాట్రు విజయ్, పెనుబోయిన మహేష్, ఎం.పానకాల యాదవ్ పాల్గొన్నారు. ర్యాలీ ఏలూరు నుంచి కామవరపుకోట మీదుగా ద్వారకాతిరుమల తరలి వెళ్ళింది.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



పోలసానిపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు : స్వచ్ఛమైన తాగునీటి ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పోలసానిపల్లిలో రిటైర్డ్ హెచ్ఎం కె.మోషే న్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. పాస్టర్లు పీటర్, డేవిడ్ వెంకటరత్నం ప్రార్థనలు చేశారు. అనంతరం ప్లాంట్ నిర్వాహకులు కె.మోషేన్ కుటుంబసభ్యులు ఎమ్మెల్యే వాసుబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం : సమాజంలో సాటి ప్రజలకోసం సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్న వ్యక్తులు, సంస్థల సేవలకు గుర్తింపుగా అవార్డులతో సత్కరించనున్నట్లు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జితెలిపారు. ఆదివారం ఆయన గణపవరంలో విలేకరులతో మాట్లాడుతూ ఈమేరకు సేవాసంస్థలు, వ్యక్తులనుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఎంపికైన వారికి డా.బీఆర్ అంబేద్కర్ సేవారత్న, మదర్. థెరిస్సా సేవారత్న, విలియం కేరి, అబ్దుల్ కలాం సేవారత్న అవార్డులతో సత్కరిస్తామన్నారు. వివరాల కోసం 63056 83467 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

రావుల చెరువు బహిరంగ వేలం పాట నోటీసు

పెదవేగి మండలం పెదకడిమి గ్రామపంచాయితీ పరిధిలో రావుల చెరువు బహిరంగ వేలం 3 సం॥రాల అనగా 01.07.2020 నుండి 30.06.2023 వరకు కోసం లీజుధర రూ.10,50,000/–లు నిర్వహించుటకు విషయమై WP No.17808/2022 తేది 30.06.2022, శ్రీ గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి వారి ఉత్తర్వులు మరియు CC No.2794/2022, తేది 16.08.2022, ఉత్తర్వులను ననుసరించి Proceedings No. A1/e- 36032/2022, ది.10.01.2023, శ్రీ యుత జిల్లా కలెక్టరు ఏలూరు జిల్లా వారి కమిటీ ఉత్తర్వులననుసరించి ది.28.01.2023వ తేదిన కమిటీ ఆధ్వర్యంలో పెదవేగి మండలం పెదకడిమి గ్రామ పంచాయితీ పరిధిలో రావుల చెరువు గౌరవ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం శ్రీ రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన ది.09.02.2023వ తేదిన ఉదయం 10.00గం.లకు కమిటీ ఆధ్వర్యములో బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ, పెదకడిమి
పెదవేగి(మం), ఏలూరు జిల్లా–534003

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729

Office mail : tpgadvt@gmail.com